సాక్షి
అనంతపురం
బుధవారం । 14 । మే । 2025



చీనీ టన్ను రూ.28 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



జేఎన్‌టీయూ బంగారాలు వీరే
జేఎన్‌టీయూ (ఏ) 14వ స్నాతకోత్సవంలో బంగారు పతకాలు దక్కించుకున్న విద్యార్థుల వివరాలను వర్సిటీ అధికారులు మంగళవారం వెల్లడించారు.

8లో

గరిష్టం/కనిష్టం
39.3°/21.9°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం అధికంగా కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

జగన్ వెంట జనసాగరం

- అగ్నివీర్ మురళీనాయక్ కుటుంబానికి వైఎస్ జగన్ పరామర్శ
- బెంగళూరు నుంచి కళ్లితండా వరకూ జగన్‌కు అడుగడుగునా నీరాజనం
- రోడ్డుకు ఇరువైపులా నిలబడి 'జై జగన్' అంటూ నినాదాలు
- కళ్లితండాకు తరలివచ్చిన ఉమ్మడి అనంతపురం జిల్లా నేతలు
- వైఎస్ జగన్ రాకతో భావోద్వేగానికి గురైన మురళి తండ్రి శ్రీరామ్‌నాయక్
- లే.. మురళి.. జగన్ సర్ వచ్చాడు.. లేచి సెల్యూట్ చేయి అంటూ కన్నీరు



కళ్లితండాలో అభిమానులకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'జై జవాన్' నినాదం మార్మోగింది. కుగ్రామం కళ్లితండాలో జనసునామీ పోటెత్తింది. అమర జవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మంగళవారం రాగా... అభిమాన గణం వెంట నడిచి జవాన్‌కు అశ్రు నివాళులర్పించింది.



బాగేపల్లి టోల్‌ప్లాజా వద్ద జగన్‌తో కరచాలనం కోసం పోటీపడుతున్న అభిమానులు



జవాన్ మురళీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అనంత, మంగమ్మ, గిరిజమ్మ, పెద్దారెడ్డి, శంకరనారాయణ



మురళీ నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేతిరెడ్డి, మాధవ్, శ్రీధర్ రెడ్డి తదితరులు



జగన్ కాన్వాయ్ వెంట జాతీయ జెండాలతో అభిమానులు



మురళీనాయక్ తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జ్యోతిబాయిలను పరామర్శిస్తున్న వైఎస్ జగన్



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్ జగన్, చిత్రంలో ఉషశ్రీచరణ్ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కేతిరెడ్డి, విశ్వేశ్వర రెడ్డి, తదితరులు →

సాక్షి, పుట్టపర్తి

'ఆపరేషన్ సింధూర్'లో భాగంగా ఈ నెల 8న జమ్ముకశ్మీర్‌లో శత్రుమూకలను చెండాడుతూ వీరమరణం పొందిన అగ్నివీర్ మురళీ నాయక్ కుటుంబ సభ్యులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. మురళీ నాయక్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జ్యోతి బాయిలను ఓదార్చారు. మురళి పోరాటాన్ని దేశం గర్విస్తోందని వైఎస్ జగన్ కొనియాడారు. మంగళవారం ఉదయం బెంగళూరులోని తన నివాసం నుంచి రోడ్డు మార్గం గుండా గోరంట్ల మండలం కళ్లితండాకు చేరుకున్నారు. మురళీ నాయక్ ఇంట్లోకి వైఎస్ జగన్ రాగానే.. జవాన్ తల్లిదండ్రులు భావోద్వేగానికి గురై బోరున విలపించారు. జగన్ రాకతో కళ్లితండా జనసంద్రంలా మారింది. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

కళ్లితండా.. కన్నీరు మున్నీరు..

నాలుగైదు రోజులుగా దిగమింగుకున్న బాధను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో ఒక్కసారిగా భావోద్వేగంతో వ్యక్తపరిచారు. విధి నిర్వహణలో మురళీ నాయక్ త్యాగాన్ని దేశం గర్వించినా.. కన్నతల్లి కంట కన్నీరు మాత్రం ఎవరూ ఆపలేక పోయారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అభిమానులు జాతీయ జెండాలతో తరలివచ్చారు. గోరంట్ల – పుట్టపర్తి మెయిన్ రోడ్డు నుంచి కిలోమీటరు దూరం ఉన్న కళ్లితండాకు వచ్చేందుకు గంటకుపైగా సమయం పట్టింది.

గత సర్కారు సంప్రదాయమే..

దేశ రక్షణలో అమరులైన వారి కుటుంబాలకు రూ.50 లక్షల ఆర్థిక సాయం చేయాలని మొదట ప్రతిపాదన తీసుకొచ్చి.. అమలు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ.. మురళీ నాయక్ కుటుంబానికి రూ.50 లక్షలు ప్రకటించడంపై వైఎస్ జగన్ కృతజ్ఞతలు తెలియజేశారు. మురళీ నాయక్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ తరఫున రూ.25 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నట్లు వైఎస్ జగన్ ప్రకటించారు.

మార్మోగిన 'జై జవాన్' నినాదం..

కళ్లితండాలోకి వైఎస్ జగన్ ప్రవేశించినప్పటి నుంచి 'జై జవాన్' నినాదం మార్మోగింది. 'భారత్ మాతాకీ జై.. మురళీ నాయక్ అమర్ రహే' అంటూ అభిమానులు జాతీయ జెండాలతో నినాదాలు చేశారు. మురళీనాయక్ కుటుంబానికి మద్దతుగా నిలిచిన వారందరికీ వైఎస్ జగన్ కృతజ్ఞతలు తెలియజేశారు. మురళి కుటుంబానికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలన్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి జనం రాక..

వైఎస్ జగన్ కళ్లితండా పర్యటన నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి వైఎస్ జగన్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. మురళీ నాయక్‌కు ఘన నివాళులర్పించారు.

తరలివచ్చిన నేతలు..

వైఎస్ జగన్ వెంట రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు మాలగుండ్ల శంకరనారాయణ, మాజీ మంత్రి సాకే శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, అత్తార్ చాంద్‌బాషా, నియోజకవర్గ సమన్వయకర్తలు ఈరలక్కప్ప (మడకశిర), టీఎన్ దీపిక (హిందూపురం), మక్బుల్ (కదిరి), మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్, నాయకులు వజ్ర భాస్కర్ రెడ్డి, చౌళూరు మధుమతిరెడ్డి, మాదినేని ఉమామహేశ్వరనాయుడు, మహాలక్ష్మి శ్రీనివాసులు, కోగటం విజయ భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

> "జగనన్నా.. వచ్చావా.. మురళీ ఎక్కడ అన్నా. నువ్వయినా మా బిడ్డ మురళీని వెంట తెస్తావనుకున్నా"
> – వైఎస్ జగన్ పరామర్శించగానే బోరున విలపిస్తూ మురళీ నాయక్ తల్లి జ్యోతిబాయి ఆక్రందన

> "మురళీ.. పైకి లేచి సెల్యూట్ చేయి.. నీ కోసం జగన్ సర్ వచ్చాడు. మన ఇంటికే జగన్ సర్ వచ్చాడు మురళీ. లే మురళీ.. లేచి సెల్యూట్ చేయి మురళీ"
> – వైఎస్ జగన్‌ను చూడగానే మురళీ నాయక్ తండ్రి శ్రీరాం నాయక్ భావోద్వేగం

> "మురళీ నాయక్‌ను అయితే తేలేను తల్లీ.. నీ బిడ్డ పోరాటం వృథా కాదు. ఎంతోమందికి రక్షణగా నిలిచి.. చిన్న వయసులోనే ఎందరికో స్ఫూర్తిగా నిలిచాడు. మురళీ త్యాగానికి రుణపడి ఉంటాం"
> – మురళీ నాయక్ తల్లిదండ్రులతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఉమ్మడి జిల్లాకు వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్/బుక్కరాయసముద్రం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మరో ఐదురోజుల్లో వర్షాలు కురిసే సూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న 3.2 మి.మీ, 15న 6.1, 16న 8.6, 17న 7.9, 18న 11.2 మి.మీ సగటు వర్షపాతం నమోదు కావొచ్చన్నారు. ఉరుములు, మెరుపులతో అక్కడక్కడా బలమైన ఈదురుగాలులు వీయవచ్చన్నారు.

15 మండలాల్లో వర్షం: జిల్లాలో 15 మండలాల పరిధిలో మంగళవారం తెల్లవారుజామున 10 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. భారీ ఉరుములు, మెరుపులతో పాటు అక్కడక్కడా ఈదురుగాలులు కూడా వీచాయి. రాప్తాడులో అత్యధికంగా 66.4 మి.మీ, గుత్తిలో 61.4, యాడికిలో 50 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. కంబదూరు 40.4 మి.మీ, శెట్టూరు 22.6, కుందుర్పి 20.6, బుక్కరాయసముద్రం 11.2 మి.మీతో పాటు విడపనకల్లు, నార్పల, గుమ్మఘట్ట, గుంతకల్లు, బ్రహ్మసముద్రం, కూడేరు, అనంతపురం, బొమ్మనహాళ్ తదితర మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఈదురుగాలులకు వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

వడదెబ్బతో మహిళ మృతి


మృతురాలు రామాంజినమ్మ (ఫైల్)

ఆత్మకూరు: వడదెబ్బకు గురై మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు.. ఆత్మకూరుకు చెందిన ఉరుముల రామాంజినమ్మ (59) సోమవారం తనకు ఉన్న రెండు ఆవులను తోలుకొని మేత కోసం పొలంలోకి వెళ్లింది. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో బంధువులు ఆమెకు కోసం వెతికారు. పొలం వద్ద స్పృహ కోల్పోయి పడి ఉన్న ఆమెను హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, అప్పటికే రామాంజినమ్మ మరణించినట్లు వైద్యులు తెలియజేశారు. రామాంజినమ్మకు భర్త, కుమారుడు ఉన్నారు.


'శ్రీరామిరెడ్డి' కార్మికులతో అధికారుల చర్చలు విఫలం

కూడేరు: శ్రీరామిరెడ్డి పథకం కార్మికులతో అధికారులు నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయి. మండలంలోని పీఏబీఆర్ సమీపంలో ఏర్పాటైన శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్ వద్ద కార్మికులతో మంగళవారం అనంతపురం ఆర్డీఓ కేశవ నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ చర్చలు జరిపారు. పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలను ఈ నెల 17న, పీఎఫ్ ఈ నెలాఖరుకు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అందుకు కార్మికులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు అంగీకరించలేదు. 38 రోజులుగా సమ్మెలో ఉన్నామని, వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందని, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేసే దిశగానే మాట్లాడితే ఎలా.. అని ఓబులు ప్రశ్నించారు. 'సమ్మెలో కి వెళ్లిన ప్రతిసారీ ఫలానా గడువులోపు ఇస్తామంటారు.. మళ్లీ స్పందించరు.. మీ హామీలపై నమ్మకం లేదు, కార్మికులు సమ్మె కొనసాగిస్తారు' అని ఓబులు స్పష్టం చేశారు. దీంతో చేసేదేమీ లేక అధికారులు వెనుదిరిగారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మురళీధర్, డీఈ శిరీషా, తహసీల్దార్ మహబూబ్ బాషా, సర్వేయర్ అయేషా సిద్దికీ, శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్ జిల్లా యూనియన్ అధ్యక్షుడు ఎర్రిస్వామి, కార్మికులు కొండారెడ్డి, రామాంజనేయులు, నాగరాజు, వన్నూరు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇక 9 రకాల పాఠశాలలు

● నూతన విధానాలు ప్రకటించిన ప్రభుత్వం ● పాఠశాలల పునర్విభజన, క్రమబద్ధీకరణకు జీఓలు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖలో 9 రకాల పాఠశాలలు పుట్టుకొచ్చాయి. ఈ మేరకు ప్రభుత్వం విధి విధానాలను ప్రకటించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలల పునర్విభజన, క్రమబద్ధీకరణకు మంగళవారం జీఓలు విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన జాబితాలను అనంతపురం శారదా నగరపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో రెడీ చేస్తున్నారు. గతంలో 117 జీఓను అనుసరిస్తూ ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. 1,2 తరగతులను ఫౌండేషన్ స్కూళ్లుగా మార్చారు. కూటమి ప్రభుత్వంలో 117 జీఓ రద్దు తర్వాత చాలా వరకు ఫౌండేషన్ స్కూళ్లను అలానే ఉంచారు. 3,4,5 తరగతులను సమీపంలోని మరో ప్రాథమిక పాఠశాలల్లోకి విలీనం చేశారు.



ఇవీ పాఠశాలలు...

శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లు (పీపీ-1,పీపీ-2), ఫౌండేషన్ స్కూళ్లు (పీపీ-1, పీపీ-2, 1-2 తరగతులు), బేసిక్ ప్రైమరీ పాఠశాలలు (పీపీ-1, పీపీ-2,1-5 తరగతులు), మోడల్ ప్రైమరీ పాఠశాలలు (పీపీ-1, పీపీ-2, 1-8 తరగతులు), ఉన్నత పాఠశాలలు (6-10 తరగతులు), ఉన్నత పాఠశాలలు (1-10 తరగతులు), హైస్కూల్ ప్లస్ (6-12 తరగతులు), హైస్కూల్ ప్లస్ (1-12 తరగతులు).

జిల్లాలో ఏయే స్కూళ్లు ఎన్నంటే...

శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లు (పీపీ-1 నుంచి 2వ తరగతి వరకు)-92, బేసిక్ ప్రైమరీ పాఠశాలలు (పీపీ-1-5 తరగతులు, 1-5 తరగతులు) 621, మోడల్ ప్రైమరీ పాఠశాలలు (పీపీ-1-5, 1-5 తరగతులు) 626, ప్రాథమికోన్నత పాఠశాలలు (1-7/8 తరగతులు) 59, ఉన్నత పాఠశాలలు (6-10 తరగతులు) 338 పాఠశాలలుగా మారాయి. మొత్తం 1,736 పాఠశాలలుగా ఏర్పాటు చేయనున్నారు.

ఆ పాఠశాలల హెచ్‌ఎంలుగా ఎస్‌ఏలు

నూతన విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా 4,556 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం/స్కూల్ అసిస్టెంట్‌గా కన్వర్షన్ చేశారు. ఇందులో భాగంగా జిల్లాలో 520 పోస్టులను సృష్టించారు. ఎంపీపీ, జెడ్పీ పాఠశాలల్లో 515, ప్రభుత్వ పాఠశాలల్లో 5 పోస్టులను కన్వర్షన్ చేశారు. ప్రస్తుతం ఆయా స్కూళ్లలో పని చేస్తున్న ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంల గురించి స్పష్టత ఇవ్వలేదు. అలాగే జిల్లాలో మరో 34 (ఎంపీపీ, జెడ్పీ-31, ప్రభుత్వం-3) స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అదే మేనేజ్‌మెంట్ స్కూళ్లలో కన్వర్షన్ చేశారు. అయితే ఏయే సబ్జెక్టులనేది అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

భర్తను బికారి చేసి..

● పెళ్లి పేరుతో ఘరానా మోసం ● నమ్మించి.. నట్టేట ముంచి
● నగలు, నగదు, కారుతో జంప్ ● భార్యపై పోలీసులకు ఫిర్యాదు

బెళుగుప్ప: లగ్జరీ జీవితం ఆమె కల. పెళ్లి పేరిట ఆ కల నెరవేర్చాలనుకుంది. ఇందుకు దివ్యాంగుడైన వ్యక్తిని ఎంపిక చేసుకుని పెళ్లి చేసుకుంది. అనుకున్న విధంగా నగదు, నగలు, కారు సమకూర్చుకున్న తర్వాత.. భర్తతో గొడవ పెట్టుకుని ఉడాయించింది. అవసరాలన్నీ తీర్చి బికారిగా మారిపోయిన భర్త.. తన భార్య మోసం చేసిందని పోలీసులను ఆశ్రయించాడు. వివరాలిలా ఉన్నాయి. బెళుగుప్ప మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ ఇబ్రహీం ఫయాజ్ దివ్యాంగుడు. పెళ్లి సంబంధాల కోసం మ్యాట్రిమోనీ ద్వారా ప్రయత్నాలు చేస్తుండగా.. రెండేళ్ల క్రితం గుంటూరు జిల్లా తెనాలికి చెందిన షబానా నచ్చింది. అటువైపు నుంచి కూడా సుముఖత వ్యక్తం చేయడంతో అనంతపురంలో కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత అనంతపురంలోనే ఓ ఇంటిని తీసుకుని కాపురం పెట్టారు.

నమ్మించి.. వంచించి..

భార్య చూపిన అమితమైన ప్రేమకు భర్త ఫిదా అయిపోయాడు. ఆమె సంతోషం కోసం ఏది అడిగినా కాదనలేకపోయేవాడు. అలా తన మాట చెల్లుబాటు అవుతున్న సమయంలో షబానా తన ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకొచ్చింది. మొదట తన అక్క జరీనా కోసం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో భర్త ఫయాజ్ పేరిట రూ.30 లక్షల పర్సనల్ లోన్ తీసుకుంది. ఆయన వేతనం నుంచి 2024 ఫిబ్రవరి నుంచి రూ.60 వేల చొప్పున ఈఎంఐ కట్ అవుతూ వస్తోంది. ఆ తర్వాత అనంతపురంలోని సొంతింటిని కూడా విక్రయించి రూ.40 లక్షలు తీసుకుంది. దీంతో ఏడాదిగా బెళుగుప్పలోని అద్దె ఇంటికి మకాం మార్చారు. ఈ క్రమంలోనే అనంతపురంలో ఫయాజ్ పేరున ఉన్న ప్లాట్‌ను సైతం విక్రయించి రూ.7 లక్షలు తీసుకుంది. అలాగే సుమారు రూ.5 లక్షలు వెచ్చించి ఐదు తులాల బంగారు నగలు కొనుగోలు చేయించింది. రాకపోకలకు అనువుగా ఉండాలని రూ.6 లక్షల విలువైన కారు కొనుగోలు చేయించింది. ఇలా తన అవసరాలు తీర్చుకున్న తరువాత గత నెల 28న బెళుగుప్పలోని నివాసంలో గొడవపడిన షబానా.. ఆ మరుసటి రోజే (29న) తన తల్లిదండ్రులు షమి, అలీ, అక్క జరీనాను పిలిపించి దివ్యాంగుడైన భర్తను ఇంట్లోనే బంధించి.. సామగ్రిని వాహనంలో వేసుకుని కారుతో సహా తెనాలికి వెళ్లిపోయింది. విలాసవంతమైన జీవితానికి అవసరమైన డబ్బు కోసం తనను వాడుకుని వంచనకు గురి చేసిన భార్య, ఆమె కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఫయాజ్ బెళుగుప్ప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ మంగళవారం మీడియాకు తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

గార్లదిన్నె: అదనపు కట్నం కోసం వివాహితను వేధింపులకు గురిచేసిన అత్తింటి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. ఈ మేరకు వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన ప్రమీలకు హిందూపురానికి చెందిన రాజశేఖర్‌తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెళ్లి సమయంలో 10 తులాల బంగారాన్ని వరకట్నంగా ప్రమీల కుటుంబసభ్యులు ఇచ్చారు. కొంత కాలంగా అదనపు కట్నం కావలంటూ ప్రమీలను రాజశేఖర్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులు వేధింపులకు గురి చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో ప్రమీలకు తెలియకుండానే రాజశేఖర్ రెండో పెళ్లి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రాజశేఖర్‌తో పాటు అతని కుటుంబసభ్యులు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో బంగారు నగల చోరీ


బాధితురాలు సుభాన్‌బీ

గుత్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ ప్రయాణికురాలి వద్ద ఉన్న బంగారు నగలను దుండగులు అపహరించారు. వివరాలు... కర్నూలుకు చెందిన సుభాన్‌బీ సోమవారం గుంతకల్లులో జరిగిన బంధువుల ఇంట శుభ కార్యానికి వెళ్లారు. మంగళవారం ఆర్టీసీ బస్సులో తిరుగు ప్రయాణమయ్యారు. బస్సు గుత్తి బస్టాండ్‌కు చేరుకోగానే కాసేపు ఆగింది. కాసేపటి తర్వాత తన వద్ద ఉన్న బ్యాగ్‌ను పరిశీలించుకున్న ఆమె... అందులో ఉంచిన ఆరు తులాల బంగారు నగలు కనిపించకపోవడంతో అపహరణకు గురైనట్లుగా నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆ ఎస్ఐపై వేటు

● సరెండర్ చేస్తూ డీఐజీ ఉత్తర్వుల జారీ

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం: శ్రీ సత్యసాయి జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐగా పనిచేస్తున్న ఎం.ప్రదీప్‌కుమార్‌పై వేటు పడింది. అతన్ని సరెండర్ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం ఉమ్మడి జిల్లా పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. ప్రదీప్‌కుమార్ ఉన్నతాధికారుల అండ చూసుకుని లాబీయింగ్ చేసేవారని, డీఎస్పీ, సీఐలను సైతం లెక్క చేయకుండా వ్యవహరించే వారని సమాచారం. దీంతో పాటు రాజకీయ అండతో పంచాయితీలు, పైరవీలు చేస్తుండటంపై ఇటీవల 'సాక్షి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో స్పందించిన అనంతపురం రేంజ్ డీఐజీ.. ప్రదీప్‌కుమార్‌ను సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

మూడు స్థానాలకు 19న ఉప ఎన్నికలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీపీ, ఒక వైస్ ఎంపీపీ స్థానానికి ఈ నెల 19న ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నెల 15న నోటిఫికేషన్ ఇచ్చి 19న ఎన్నికలు నిర్వహించేందుకు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎన్నికల అధికారులు రాజోలి రామచంద్రారెడ్డి, జి.వెంకటసుబ్బయ్య తెలిపారు. కాగా.. గతంలో వివిధ కారణాలతో ఖాళీ ఏర్పడ్డ స్థానిక సంస్థల స్థానాలకు మార్చి 27న ఎన్నికలు నిర్వహించారు. అయితే గాండ్లపెంట, రామగిరి ఎంపీపీ స్థానాలతో పాటు కంబదూరు వైస్ ఎంపీపీ స్థానానికి ఎన్నిక వాయిదా పడింది. ఆయా చోట్ల మార్చి 28న మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని అధికారులు చర్యలు తీసుకున్నా.. రాజకీయ కారణాలతో వాయిదా పడ్డాయి.

జేఎన్‌టీయూ బంగారాలు వీరే

అనంతపురం: ఈ నెల 17న జరిగే జేఎన్‌టీయూ (ఏ) 14వ స్నాతకోత్సవంలో బంగారు పతకాలు దక్కించుకున్న విద్యార్థుల వివరాలను వర్సిటీ అధికారులు మంగళవారం వెల్లడించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసే గవర్నర్, వర్సిటీ చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా వారు బంగారు పతకాలు అందుకోనున్నారు.


గోవుల వాల్మీకి హరిత (3 బంగారు పతకాలు)


పూజిత కుమార్ రెడ్డి (6 బంగారు పతకాలు)


టి. సుప్రజ (4 బంగారు పతకాలు)


ఎం.జాహ్నవి (2 బంగారు పతకాలు)

వర్సిటీ పరిధిలో బంగారు పతకాలు దక్కించుకున్న వారు

విద్యార్థి	బ్రాంచ్	కళాశాల
షేక్ సాజిద్‌మురాద్	సివిల్	ఆదిత్య కళాశాల, మదనపల్లి
దూదేకుల సబియాసుల్తానా	ఈఈఈ	గేట్స్, గుత్తి
సయ్యద్ మహమ్మద్‌అక్రమ్	మెకానికల్	శ్రీరాజేశ్వరి కళాశాల, ప్రొద్దుటూరు
కాళిదాసువెంకట కార్తీక్	ఈసీఈ	శ్రీవెంకటేశ్వర కళాశాల, నెల్లూరు
ముచ్చెర్ల రాజురమ్యలక్ష్మి	సీఎస్ఈ	ఆదిత్య కళాశాల, మదనపల్లి
ఎస్ఎల్ చందన లక్ష్మీప్రియ	ఐటీ	ఎస్వీ కళాశాల, తిరుపతి
సెట్లం అఖిల	ఫుడ్ టెక్నాలజీ	జేఎన్‌టీయూ, కలికిరి
వెలిశెట్టి వెంకటనాగమణి	ఏఐ, డేటా సైన్స్	అన్నమాచార్య, కడప
భరత్ భవిత	సీఎస్ఈ	పీబీఆర్‌వీఐ, కావలి
చల్లా నాగేంద్రబాబు	సీఎస్ఈ (డేటా సైన్స్)	గేట్స్, గుత్తి
వి.హర్షిత	సీఎస్ఈ (ఏఐ, మెషిన్ లర్నింగ్)	ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి
ఎం.అభినయన	సీఎస్ఈ (ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్)	పీబీఆర్‌వీఐ, కావలి
పి.లిఖిత రెడ్డి	బీఫార్మసీ	ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, చిత్తూరు

క్యాంపస్ కళాశాల విద్యార్థులు

విద్యార్థి	బ్రాంచ్	పతకాలు
జి.వాల్మీకి హరిత	సివిల్	3
పి.ఫయద్ ఆలీ	ఈఈఈ	3
పూజిత కుమార్‌రెడ్డి	మెకానికల్	6
పి.వనిత	మెకానికల్	1
వి.శ్రీవైష్ణవి	ఈసీఈ	2
టి.సుప్రజ	సీ.ఎస్	4
ఎం.జాహ్నవి	కెమికల్	2
వి.సునీత (ఎంటెక్)	స్ట్రక్చరల్ ఇంజినీరింగ్	1

జేఎన్‌టీయూ పులివెందుల పరిధిలో బంగారు పతకాలు దక్కించుకున్న వారు

విద్యార్థి	బ్రాంచ్
పి. అమృతబాబు	సివిల్
పుల్లా భువనశ్రీ	ఈసీఈ
వి.మహత	మెకానికల్
ఓ గ్లేసియా	ఈసీఈ
ఎం.వాసంతి	సీఎస్ఈ

హంద్రీ-నీవాపై బహిరంగ చర్చకు సిద్ధం

● ఎమ్మెల్యే కాలవ సవాల్‌ను స్వీకరించిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



ఉరవకొండ: హంద్రీ-నీవా అభివృద్ధికి టీడీపీ ఎంత మేరకు చర్యలు తీసుకుందో అనే అంశంపై రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుతో బహిరంగ చర్చకు తాను సిద్ధమంటూ శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి ప్రతిసవాల్ విసిరారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హంద్రీ-నీవా ప్రాజెక్ట్ ఆవిర్భావంనుంచి ఇప్పటి వరకూ ఎవరి హయాంలో ఎంత మేర అభివృద్ధి పనులు జరిగాయో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయంగా ఎమ్మెల్యే కాలవ చర్చకు ఎప్పుడు వస్తారో స్పష్టం చేయాలన్నారు. 1983 నుంచి 85 మధ్య డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన రాయలసీమ ఉద్యమంతో హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులు వచ్చాయన్నారు. ఇది చరిత్ర చెప్పే సత్యమన్నారు. ఈ ఉద్యమం మూలంగానే 1987లో హంద్రీ-నీవాకు అప్పటి సీఎం ఎన్టీఆర్ శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. 1996 మార్చి 11న చంద్రబాబు సీఎం హోదాలో ఓసారి ఉరవకొండలో, 1999 జూలై 9న ఆత్మకూరులో మరోసారి హంద్రీనీవా శంకుస్థాపన చేస్తూ 40టీఎంసీల సామర్థ్యాన్ని 5 టీఎంసీలకు కుదించారన్నారు. 2004 డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం అయ్యాక పనులు వేగవంతంగా జరిగాయన్నారు. మల్యాల నుంచి 12 పంపుల ద్వారా జీడిపల్లి మొదటి దశకు, జీడిపల్లి నుంచి పుంగనూరుకు రెండో దశ పనులు చేపట్టారన్నారు. ఈ పనులపై ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కూడా అబద్ధాలు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. హంద్రీ-నీవా అంశంపై ఎమ్మెల్యే కాలవతో పాటు ఎవ్వరొచ్చినా తాను చర్చకు సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు.

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

● కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం


సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్ఓ ఎ.మలోలతో కలిసి అధికారులతో ఆయన సమీక్షించారు. జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఈనెల 17న జిల్లాకు విచ్చేస్తున్నారన్నారు. భోజన ఏర్పాట్లు జాగ్రత్తగా చేయాలన్నారు.

● జిల్లాలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. 15న గుత్తి పట్టణానికి హెలికాప్టర్ ద్వారా చేరుకుని స్థానికంగా జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. రాత్రి గుత్తి మండలం బేతపల్లిలో బసచేస్తారన్నారు. 16న ఉదయం బేతపల్లి వద్ద విండ్ ఎనర్జీ కంపెనీ ప్రారంభోత్సవంలో పాల్గొంటారన్నారు. 16న కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్న, రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, తదితరులు జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నారని, ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, తహసీల్దారు హరికుమార్ పాల్గొన్నారు.

దశలవారీగా ప్లాస్టిక్ నిషేధం అమలు

జిల్లాలో దశల వారీగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ప్లాస్టిక్ నిషేధం, జీఎస్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ, తదితర అంశాలపై కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. దుకాణాల వద్ద తడి, పొడి చెత్తకు బిన్‌లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించాలని ఆదేశించారు. పారిశుధ్య సిబ్బందికి రక్షణ సామగ్రి, పనిముట్లు ఇవ్వాలన్నారు. ఉపాధి పనులు విరివిగా చేపట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డీపీఓ, డ్వామా పీడీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తీరు మారకపోతే ఉద్యమిస్తాం

● చలో డీపీటీఓ కార్యక్రమంలో ఎన్ఎంయూ నేతలు


ర్యాలీగా డీటీపీఓ కార్యాలయానికి వెళుతున్న ఎన్ఎంయూ నేతలు

అనంతపురం క్రైం: ఆర్టీసీలో అధికారుల వేధింపులు తారాస్థాయికి చేరుకున్నాయని, వారి తీరు మారకపోతే ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామంటూ నాయకులు హెచ్చరించారు. ఆర్టీసీలో అధికారుల వేధింపులపై మంగళవారం చలో డీపీటీఓ కార్యక్రమాన్ని ఎన్ఎంయూ చేపట్టింది. జిల్లాలోని ఏడు డిపోలకు సంబంధించిన కార్మికులు పాల్గొన్నారు. ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వి.రమణ మాట్లాడుతూ.. కష్టపడే కార్మికులకు ఆర్టీసీలో విలువలేకుండా పోతోందన్నారు. అక్రమాలకు పాల్పడేవారికే అధికారులు అండగా నిలుస్తున్నారని మండిపడ్డారు. చిన్నపాటి కారణాలతో కార్మికులపై కఠిన చర్యలు తీసుకుంటున్న అధికారులు ఇప్పటి వరకూ అక్రమార్కులపై కనీస చర్యలు కూడా తీసుకోలేకపోతుండడమే ఇందుకు నిదర్శనమన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణ, అర్హత ఉన్న సిబ్బందికి పదోన్నతులు, 12 వేల ఖాళీ పోస్టుల భర్తీ, ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు, తదితర డిమాండ్ల సాధనకు ఎన్ఎంయూ సాగిస్తున్న పోరాటాలకు కార్మికులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడు సూరిబాబు, కార్యదర్శి టి.ప్రతాప్, రీజనల్ ఉపాధ్యక్షుడు సదాశివ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో బయటపడిన శివలింగం


తవ్వకాల్లో బయటపడిన శివలింగం

గుంతకల్లు రూరల్: మండలంలోని నాగసముద్రం గ్రామంలో మంగళవారం ఉపాధి పనులు చేస్తుండగా ఓ శివలింగం బయటపడింది. పనుల్లో భాగంగా గ్రామంలోని చౌడమ్మ కొండపై ఖండిత కందకాల తవ్వకాలను చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం కూలీలు తవ్వకాలు సాగిస్తుండగా శివలింగం బయటపడడంతో కూలీలు పాలతో అభిషేకించి, పూజలు నిర్వహించారు.

శేష వాహనంపై శ్రీవారు



రాయదుర్గం టౌన్: స్థానిక కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా శేష వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు పెద్ద ఎత్తున జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం హనుమద్ వాహన సేవలు ఉంటాయని ఆలయ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

గ్రామీణ రోడ్ల నిర్మాణానికి నాబార్డు నిధులు

'అనంత' జిల్లాలో పనుల వివరాలు...

నియోజక వర్గం	పనుల సంఖ్య	కిలో మీటర్లు	కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)
గుంతకల్లు	2	5.7	2.89
కళ్యాణదుర్గం	2	11.39	3.20
రాప్తాడు	2	8	3.15
రాయదుర్గం	3	8.33	3.02
శింగనమల	1	5.5	2.50
తాడిపత్రి	3	4.82	3.00
ఉరవకొండ	6	20.25	8.50

అనంతపురం సిటీ: గ్రామీణ ప్రాంత రహదారుల నిర్మాణానికి నాబార్డు నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు పంచాయతీరాజ్ ఎస్ఈ మహమ్మద్ జహీర్ అస్లాం మంగళవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో 37 పనులు మంజూరు కాగా, 123.26 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి రూ.49.09 కోట్లు మంజూరైనట్లు వివరించారు.

హోమియో.. వైద్యం అందదయో!

- అందుబాటులో ఉండని వైద్యాధికారి, సిబ్బంది
- నిద్రమత్తులో జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి


పాతూరు సీడీ ఆస్పత్రిలోని హోమియో వైద్యశాల


హోమియో వైద్యశాల ముందు పడిపోయిన తాగుబోతు

అనంతపురం మెడికల్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి బాధ్యతారాహిత్యం, ఆయుష్ వైద్యాధికారుల అలసత్వం వెరసి హోమియో వైద్యం రోగులకు అందని ద్రాక్షగా మారింది. ఆయుష్ వైద్యులు, సిబ్బంది ఇష్టమొచ్చినట్లు విధులకు హాజరవుతూ.. కీలకమైన స్థానాల్లో క్లాస్ 4 ఉద్యోగులను కూర్చొబెట్టి వెళ్తుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. నగరంలోని పాతూరు చెస్ట్ డిసీజెస్ ఆస్పత్రిలోని హోమియో వైద్యశాలలో వైద్యాధికారి అందుబాటులో ఉండకపోవడంతో కేవలం స్వీపర్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వాస్తవంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరక వైద్యులు, సిబ్బంది ఉండాలి. కానీ అటువంటి పరిస్థితి లేదు. రూ.లక్షల్లో వేతనాలు తీసుకుంటూ విధులకు గైర్హాజరవుతుండడం చర్చనీయాంశమైంది.

తాగుబోతులకు అడ్డాగా..

వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తాగుబోతులకు అడ్డాగా మారింది. పట్టపగలే సీడీ ఆస్పత్రిలోని హోమియో వైద్యశాల ఆవరణలో తప్పతాగి పడుకుంటున్నారు. వారిని అక్కడి నుంచి పంపించే నాథుడే లేరు. వైద్యాధికారి, మందులిచ్చే గదులను మాత్రం తెరిచి ఉంచేశారు. వాస్తవంగా హోమియో వైద్యులు కేవలం ప్రపంచ హోమియోది నోత్సవం రోజున మాత్రమే అల్లోపతితో అనర్థం..హోమియోతో ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ ఉండవని జెండాలు పట్టుకుని రోడ్లపైకి వస్తుంటారు. ఇక మిగితా సమయంలో వారు కన్పించరు. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు అప్పుడప్పుడు ఆయుష్‌కు సంబంధించిన హోమియోపతి, యునానీ తదితర వాటిపై నిఘా ఉంచితే బాగుంటుందని ఆ శాఖకు చెందిన వర్గాలంటున్నాయి. హోమియోపతి వైద్యాధికారుల విధులపై కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ దృష్టిసారిస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.


ఖాళీగా ఉన్న వైద్యాధికారి కుర్చీ

క్లుప్తంగా

‘ఒకే స్థలానికి రెండు పట్టాలెలా ఇస్తారు?’


పట్టాను చూపుతున్న బాధితులు సర్దాని, నాగమ్మ

ఆత్మకూరు: ‘మాకు 1999లో ప్రభుత్వం రెండున్నర సెంట్ల స్థలానికి పట్టా ఇచ్చిందని, ఇప్పుడు మాకు తెలియకుండా అదే స్థలానికి మరొకరికి పట్టా ఎలా ఇస్తారు’ అని వై. కొత్తపల్లి గ్రామానికి చెందిన చాకలి సర్దాని, నాగమ్మ వాపోయారు. మంగళవారం వారు తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. తాము నాలుగేళ్ల క్రితం పొట్టకూటి కోసం అనంతపురం వెళ్లామన్నారు. ఇదే అదునుగా భావించిన గ్రామానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమ పేరుమీద ఉన్న 2.5 సెంట్ల స్థలాన్ని తన పేరిట పట్టా చేయించుకుని అందులో షెడ్లు నిర్మిస్తున్నాడన్నారు. దీనిపై అధికారులు సరైన సమాధానం ఇవ్వడం లేదన్నారు. దీనిపై విలేకరులు వీఆర్వో జయన్నను ప్రశ్నించగా ఒత్తిళ్లతో స్థలం వేరొకరికి ఇవ్వాల్సి వచ్చిందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరిస్తామని చెప్పుకొచ్చారు.

టెన్త్, ఇంటర్‌లో ‘మాంటిస్సోరి’ ప్రభంజనం


పార్థీవ్‌రెడ్డి


చైత్ర

రాప్తాడు: ఇంటర్, పదో తరగతి(సీబీఎస్‌ఈ) పరీక్ష ఫలితాల్లో మాంటిస్సోరి ఎలీట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. టెన్త్‌లో 279 మందికి గాను అందరూ ఉత్తీర్ణత సాధించారు. పార్థీవ్‌రెడ్డి 486/500 మార్కులు సాధించాడు. ఇంటర్‌లో 280 మందికిగాను అందరూ పాసయ్యారు. ఇందులో చైత్ర 459/500 మార్కులతో ప్రతిభ చాటింది. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పాఠశాల ఎండీ కృష్ణ భరత్, కరస్పాండెంట్ కృష్ణ సమీరా, ప్రిన్సిపాల్ ప్రతాప్ రెడ్డి అభినందనలు తెలిపారు.

అభివృద్ధి విషయంలో కుల,మతాలకు తావివ్వొద్దు

- కలెక్టర్‌తో హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: అభివృద్ధి విషయంలో కుల,మతాలకు తావివ్వొద్దని హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరారు. మంగళవారం వారు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు సీహెచ్ విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సప్తగిరి సర్కిల్ రోడ్డు విస్తరణ కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. సప్తగిరి సర్కిల్‌లోని మసీదు కాంప్లెక్స్‌ను వెంటనే తొలగించి నగరవాసులకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని కోరారు. అధికారుల తీరు నడిమివంక గంగమ్మగుడి, కొత్తూరు వాసవీ అమ్మవారి ఆర్చి, బెంగళూరు రోడ్డులోని శివకోటి, నసనకోట ముత్యాలమ్మ ఆలయాల విషయంలో ఓ రకంగా, మసీదు విషయంలో మరో రకంగా ఉండడం విచారకరమన్నారు. లలితకళాపరిషత్ వినాయక ఆలయం పడగొడితే కళాకారుల డబ్బుతోనే ఆలయం నిర్మించుకోవాల్సి వస్తోందన్నారు. అదే మసీదు కాంప్లెక్స్ తొలగింపు కోసం రూ.10 కోట్ల వరకు పరిహారం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా ఇంకా ఎందుకు అలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే రోడ్డు విస్తరణ చేపట్టి ప్రజల ఇక్కట్లు తీర్చాలని కోరారు. బీజేపీ సీనియర్ నాయకులు విఠోబరావు, వీరాంజనేయులు, దుద్దేకుంట వేంకటేశ్వరరెడ్డి, ఆరెస్సెస్ ప్రతినిధి విజయ్, చంద్రశేఖర్,లక్ష్మన్, చిరంజీవి, రామాంజనేయాచారి, రవికుమార్ పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షిద్దాం


పిల్లల హక్కుల బుక్‌లెట్లు విడుదల చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: బాలల హక్కులను పరిరక్షిద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ పేర్కొన్నారు. అనంతపురం రూరల్ 5 సెక్టార్ పరిధిలోని సత్యదేవనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా ఆమె బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బాలల హక్కులు- పోక్సో చట్టం గురించి వివరించారు. బాలికలు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. బాలికల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, అభ్యంతరకరంగా మాట్లాడినా పోక్సో చట్టం ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. బాలల హక్కులకు భంగం వాటిల్లినా, బాల్యవివాహాలు చేస్తున్నా 1098 లేదా ఐసీడీఎస్ లేదా పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం పిల్లల హక్కుల గురించి రూపొందించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. మహిళా పోలీస్ హసిత, అంగన్‌వాడీ వర్కర్లు ప్రభావతి, సరస్వతి, శంకరమ్మ పాల్గొన్నారు.

వేకువజాము నుంచే చెత్త సేకరించాలి

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్


చెత్త సేకరణపై స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కార్పొరేషన్: నగరంలో రోజూ వేకువజాము నుంచే చెత్త సేకరణ జరగాలని కమిషనర్ బాలస్వామిని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం నగరంలోని నిర్మలానందనగర్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆ ప్రాంతంలో రోజూ ఏ సమయంలో చెత్త సేకరణ జరుగుతోందని, తడి, పొడి చెత్త వేరు చేసి తీసుకుంటున్నారా? తదితర వాటిపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రతి 350 ఇళ్లకు చెత్తను సేకరించటానికి ఒక మైక్రో ప్యాకెట్‌గా పరిగణించి, ఇద్దరు కార్మికులు ఉండేలా చూసుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నారా లేదానని ఆరా తీశారు. చెత్తను తీసుకెళ్లడానికి ఏ సమయంలో వస్తున్నారని నిర్మలానందనగర్‌లోని రేఖ అనే మహిళను కలెక్టర్ ఆరా తీయగా ఉదయం రోజూ 8 నుంచి 9 గంటల సమయంలో వస్తున్నారని చెప్పారు. దీంతో సంబంధిత ప్రజారోగ్యాధికారులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

నగరంలోని ఇళ్లు, జానాభా ప్రాతిపదికన ఎంత మంది పారిశుధ్య కార్మికులు అవసరం, ఏ మేరకు ఆవశ్యకత ఉందని కలెక్టర్ కమిషనర్‌తో ఆరా తీశారు. పారిశుధ్య కార్మికులు తక్కువగా ఉంటే మరికొంత మందిని నియమించేందుకు కౌన్సిల్ అనుమతి తీసుకోవాలని, ఆ ప్రతిపాదనలను సీడీఎంఏకి పంపి, కార్మికులను ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుందామన్నారు. ఈ సందర్భంగా ఓ దుకాణదారుడు చెత్తను రోడ్డుపై వేయడాన్ని గమనించిన కలెక్టర్ అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదన్నారు. ప్రతి వ్యాపారుడు తడి, పొడి చెత్త కోసం డస్ట్ బిన్స్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ వాహనాలకు చెత్తను అందించాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఈ చంద్రశేఖర్, ఈఈ షాకీర్, ఇన్‌చార్జ్ ఈఈ బీఎల్ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో లోపాలు కన్పిస్తే ఫిర్యాదు చేయండి


హెచ్ఓడీలతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు

అనంతపురం మెడికల్: రోగులకు సరఫరా చేస్తున్న డైట్‌లో ఏమైనా లోపాలు, డైట్ నిర్వాహకులు బాధ్యతారాహిత్యం కన్పిస్తే తనకు ఫిర్యాదు చేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మెడిసిన్ వైద్యులకు సూచించారు. మంగళవారం సర్వజనాస్పత్రిలో వివిధ విభాగాల హెచ్ఓడీలతో ఆయన సమావేశమయ్యారు. రోగులకు అందించే డైట్ సకాలంలో సరఫరా చేయకపోయినా, ఏమైనా నాణ్యత లోపించినా..సురక్షిత ప్రమాణాలు పాటించని సమస్యలు మీ దృష్టికి వస్తే రెడిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. శానిటేషన్‌పై కూడా ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద కేసులను పెంచాలన్నారు. అధిక సంఖ్యలో కేసులు నమోదవడం ద్వారా ఆస్పత్రి అభివృద్ధికి నిధులు విడుదలవుతాయని తెలిపారు. రోగులతో స్నేహపూర్వకంగా ఉండేందుకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ హాస్పిటల్ సాఫ్ట్‌వేర్‌పై వైద్యులకు శిక్షణనిచ్చారు. అసోసియేట్, అసిస్టెంట్, పీజీ, హౌస్‌సర్జన్లు రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే అందుకు హెచ్ఓడీలే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలి


సనపలో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి మల్లికార్జున

ఆత్మకూరు: హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లితుందని, వెంటనే పనులు ఆపాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సనప గ్రామంలో సీపీఐ మండల మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు కాలువ వెడల్పు పనులు పరిశీలించడానికి వచ్చిన సందర్భంగా జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు పిల్లకాలువల తవ్వకం గురించి నోరు కూడా మెదపలేదని విమర్శించారు. ఇప్పటికైనా సీఎంతో మాట్లాడి పిల్ల కాలువలు పనులు చేయించి ఆయకట్టుకు నీరందించేలా చూడాలన్నారు. అంతకముందు ఆయన సీపీఐ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ, నాయకులు రామాంజనేయులు, పెదన్న, ఓబుళపతి, బాలయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు నాణ్యతగా చేపట్టండి


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

రాప్తాడు: డ్రైనేజీ పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. ముస్లీం మైనార్టీ కాలనీలో ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న డ్రైనేజీ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. డ్రైనేజీ పనులు పూర్తి కాగానే సీసీ రోడ్డు పనులు చేపడతామని ఆమె తెలిపారు.

వివాహిత బలవన్మరణం

అనంతపురం: పుట్టింటికి వెళ్లి వెంటనే రావాలని భర్త సూచించడంతో మనస్తాపం చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం, మాధవరం గ్రామానికి చెందిన బోయ ఈరన్న చిన్న కుమార్తె ఉరుకుందమ్మ (24)కు 2020లో అదే జిల్లా నందవరం గ్రామానికి చెందిన నరసింహులు కుమారుడు పాపయ్యతో వివాహమైంది. వీరికి మూడేళ్ల వయస్సు, మూడు నెలల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో తన సోదరుడు నాగరాజు వివాహ నిశ్చితార్థం ఉండడంతో ఉరుకుందమ్మ పుట్టింటికి వెళ్లింది. నిశ్చితార్థ వేడుక ముగిసిన తర్వాత స్వగ్రామానికి చేరుకోగానే సాయంత్రం పాపయ్య ఫోన్ చేసి తన భార్యను వెంటనే మా ఊరికి పంపాలని మామను కోరాడు. బుధవారం పిలుచకొస్తామని తెలిపినా అల్లుడు వినలేదు. దీంతో ఆదివారమే కుమార్తెను తండ్రి పిలుచుకెళ్లి భర్త వద్ద వదిలాడు. సోమవారం ఉదయం 11 గంటలకు పాపయ్య మరోసారి ఫోన్ చేసి ఉరుకుందమ్మ కనిపించడం లేదని తెలిపాడు. దీంతో కుమారుడు నాగరాజు, అలుళ్లు తాయన్న, రమేష్‌తో కలసి నందవరం గ్రామానికి ఈరన్న చేరుకుని చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చేపట్టాడు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం అనంతపురం త్రీ టౌన్ పోలీసులు ఫోన్ చేసి ఉరుకుందమ్మ రైల్వే స్టేషన్ క్వార్టర్స్ పక్కన చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా తెలిపారు. దీంతో మృతురాలి కుటుంబసభ్యులు అనంతపురానికి చేరుకుని ఉరుకుందమ్మ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. అల్లుడి ఒత్తిళ్లు తాళలేకనే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ కె.శాంతి లాల్ తెలిపారు.

అనారోగ్యాన్ని తాళలేక ఓ వివాహిత...

రాప్తాడు రూరల్: అనారోగ్యాన్ని తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం పిల్లిగుండ్ల కాలనీలో నివాసముంటున్న రాజేశేఖర్‌కు ఆరు నెలల క్రితం వడ్డె నందిని (22)తో వివాహమైంది. దాదాపు ఏడాదిగా ఆస్తమాతో బాధపడుతున్న ఆమె పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందింది. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న నందిని మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తాగునీటి సౌకర్యం కల్పించండి సారూ!

ఆత్మకూరు: ప్రస్తుతం రేషన్‌కార్డులకు సంబంధించి రోజుకు పదుల సంఖ్యలో లబ్ధిదారులు సచివాలయాలకు తరలివస్తున్నారు. ఆత్మకూరు సచివాలయం-2 లో కనీసం తాగునీటి వసతి కల్పించకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి కావడంతో దాహంతో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి సచివాలయంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


ఆత్మకూరు సచివాలయం-2 లో మూలన పడేసిన వాటర్ క్యాన్

యువతి ఆత్మహత్య

అనంతపురం: స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ మార్గంలో మంగళవారం రైలు కింద పడి ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దాదాపు 20 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు, ఆకుపచ్చ రంగు టాప్, పంజాబీ డ్రెస్, బ్లూకలర్ ప్యాంట్, పింక్ కలర్ పెట్టీకోట్, పింక్ కలర్ చెప్పులు ధరించినట్లుగా గుర్తించారు. యువతి ఆచూకీ తెలిస్తే 94405 57054, 99513 25345 నంబర్లకు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

బదిలీల్లో అసంబద్ధాలను పరిష్కరించాలి


డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రస్తుతం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియలో అసంబద్ధంగా ఉన్న అంశాలను పరిష్కరించాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విష్ణువర్దన్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శి టి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీనియార్టీ జాబితాను, వికలాంగుల ధ్రువీకరణ పత్రాల వివరాలను, గతంలో ప్రిఫరెన్షియల్ కేటగిరి ఉపయోగించుకున్న వారి వివరాలను, సర్దుబాటు ప్రక్రియలో ఎఫెక్ట్ అయిన ఉపాధ్యాయుల వివరాలను, నూతనంగా అప్డేట్ అవుతున్న పాఠశాల వివరాలను ప్రకటించాలని కోరారు. ఈ సమస్యలను పరిశీలించి అర్హులైన టీచర్లకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పీఎస్‌హెచ్‌ఎంలకు ప్రాధాన్యతనివ్వాలి

ప్రస్తుతం పని చేస్తున్న ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు (పీఎస్‌హెచ్‌ఎం) త్వరలో జరగబోయే ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రాధాన్యతనివ్వాలని పీఎస్‌హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం పని చేస్తున్న పీఎస్‌హెచ్‌ఎంకు కేటాయించిన తర్వాతనే సబ్జెక్టు టీచర్లకు కన్వర్షన్, ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించి భర్తీ చేయాలని విన్నవించారు. ప్రస్తుత బదిలీల్లో రేషనలైజేషన్‌కు గురయ్యే పీఎస్‌హెచ్‌ఎంలకు పాత స్టేషన్ పాయింట్లను కేటాయించాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రంగప్రసాద్, నారాయణస్వామి, రమణప్రసాద్, గంగరాజు, జనార్దన్‌రెడ్డి, ఈశ్వరయ్య ఉన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: బీసీలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని ఆర్‌పీఎస్(రిజర్వేషన్ పరిరక్షణ సమితి) వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గాండ్ల కల్యాణ మంటపంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కులగణన కూడా చేపట్టాలన్నారు. చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజరేషన్లు అమలు చేస్తున్నారని, బీసీలకు రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించినా అమలు చేయడం లేదన్నారు. దీనిపై బహుజన ప్రజా ప్రతినిధులు పార్లమెంట్‌లో చర్చించాలని కోరారు. ఆగస్టులో బహుజన ప్రజా ప్రతినిధులను జిల్లా కేంద్రంలో సన్మానించనున్నట్లు తెలిపారు. నాయకులు చిరుతల విఠల్ గౌడ్, నాగభూషణం, నారాయణనాయక్, ఎర్రిస్వామి, వరదరాజులు, నాగేంద్ర పాల్గొన్నారు.

దేశంలో శాంతి నెలకొనాలి


దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న మేయర్ వసీం, కార్పొరేటర్లు

అనంతపురం కల్చరల్: దేశంలో ఉద్రిక్తతలు తగ్గి సుఖశాంతులు నెలకొనాలని మంగళవారం పెనుకొండలోని బాబయ్య దర్గాలో ప్రార్థనలు చేపట్టినట్లు మేయర్ వసీం తెలిపారు. యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశ ప్రజలతో పాటూ వక్ఫ్ సవరణ చట్టంతో ఆందోళనలో ఉన్న ముస్లింలు ప్రశాంతంగా ఉండాలని కోరుతూ ప్రార్థించామన్నారు. ముస్లింలకు ఇబ్బందికరంగా ఉన్న చట్టాలను వెనక్కు తీసుకునేలా మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుకున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇసాక్ మదని, అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత కాకర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

‘మై భారత్’ను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం కల్చరల్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ‘మై భారత్’ అధికారిక పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని నెహ్రూ యువకేంద్రం(ఎన్‌వైకే) ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ గోవర్ధన శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఎన్‌వైకేలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశభక్తి, సామాజిక బాధ్యత, ప్రజాసేవలో ఆసక్తి ఉన్న యువత మై భారత్ అధికారిక పోర్టల్లో లాగిన్ అయి తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. యువతలో నాయకత్వ నైపుణ్యాల పెంపు, సమాజంపై ప్రభావం చూపే అవకాశాలు, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేసే మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.

ప్లానింగ్ కార్యదర్శి ప్రశాంత్‌కు నివాళి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో ప్లానింగ్ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూ..ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రశాంత్‌కు నగరపాలక సంస్థ అధికారులు నివాళులర్పించారు. మంగళవారం నగరపాలక సంస్థ ఆవరణంలో ప్రశాంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్న వయసులోనే ప్రశాంత్ మృతి చెందడం బాధాకరమని ఎస్‌ఈ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మృదు స్వభావి అని, విధి నిర్వహణలో చిత్తశుద్ధితో వ్యవహరించే వారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని టీపీఓ శిరీష పేర్కొన్నారు. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బంది మురళీ, పట్టణ ప్రణాళిక కార్యదర్శులు పాల్గొన్నారు.

భువనేశ్వరి ఆత్మహత్య కేసులో మలుపు

రాప్తాడురూరల్: గత ఫిబ్రవరిలో ఆత్మహత్యకు పాల్పడిన అనంతపురం రూరల్ మండలం పాపంపేట శివారులోని భాగ్యనగర్‌కు చెందిన మాజీ వలంటీరు భువనేశ్వరి కేసు దర్యాప్తు మలుపు తిరిగింది. అప్పట్లో తండ్రి ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసు నమోదు చేసిన పోలీసులు... ఆ తర్వాత ఆత్మహత్యకు ప్రేరేపించిన అంశాలపై మృతురాలు రాసిన లేఖ లభించడంతో ఆ దిశగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో భువనేశ్వరిని ప్రేమ పేరుతో ఇబ్బంది పెట్టిన హర్షవర్దన్, ఆమె తల్లి పద్మావతిపై కేసు నమోదు చేసి, మంగళవారం ఇద్దరినీ అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

భక్తిశ్రద్ధలతో జలధి


పూజలందుకున్న అక్కమ్మ దేవతలు

ఆత్మకూరు: మండల కేంద్రంలో అక్కమ్మ దేవతల వరుసలో భాగంగా మంగళవారం జలధి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలం నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆత్మకూరు సమీపంలోని ఓ తోటలో బావి వద్ద అక్కమ్మ దేవత గంపకు జలధి పూజ చేసి అక్కమ్మ దేవతల ఆలయానికి చేరుకున్నారు.


అమ్మవారికి జలధి పూజ నిర్వహిస్తున్న దృశ్యం


అక్కమ్మ దేవతల గంపను ఆలయానికి తీసుకొస్తున్న దృశ్యం